డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలే

- న్యూఇయర్ వేడుకలపై నిఘా
- ఎక్సైజ్ ఈడీ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్, నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఈడీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో తనిఖీల కోసం ప్రత్యేకంగా దాదాపు 40 టీమ్‌లను ఏరాటు చేస్తున్నామని, అనుమానితులకు డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. మద్యం వినియోగించడానికి అనుమతి తీసుకున్న కమర్షియల్ ప్రాంతా ల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 31 వరకు సోదాలు చేపడతామని తెలిపారు.

కోటి విలువైన డ్రగ్స్ పట్టివేత

- ఇస్నాపూర్‌లో ఇద్దరి అరెస్ట్
- సంగారెడ్డి, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీల వెల్లడి

పటాన్‌చెరు, డిసెంబర్ 21: న్యూఇయర్ వేడుకల కోసం ముంబై నుంచి తీసుకొస్తున్న ఎండీఎంఏ డ్రగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ చైతన్య మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. ఇస్నాపూర్‌లో శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు తనిఖీ చేయగా, మహమ్మద్ సలీం అలియాస్ హమీద్ షేక్(30), ముఖేష్ దూబే (30) వద్ద కిలో నిషేధిత ఎండీఎంఏ డ్రగ్ పట్టుబడింది. వీరిని ముంబైవాసులుగా పోలీసులు గుర్తించారు.

డ్రగ్స్ రహితంగా న్యూఇయర్ వేడుకలు

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): మాదకద్రవ్య రహితంగా 2025 కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు ప్రజలకు సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాజధాని నడిబొడ్డున ‘బిగ్’ స్కెచ్..!

- రూ.660 కోట్ల విలువైన ఐదెకరాల సర్కారు భూమి కబ్జా
- కేసీఆర్ హయాంలో రెండుసార్లు అడ్డుకొని కేసులు నమోదు
- ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదంగా కోర్టునూ తప్పుదోవ
- కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకొని మళ్లీ ప్రవేశం
- భూఅన్యాక్రాంతాన్ని వెలుగులోకి తెచ్చిన ‘నమస్తే తెలంగాణ’
- కబ్జా జరగలేదంటూ జలమండలి, రెవెన్యూ శాఖల వివరణ
- తెర వెనుక ఎవరని అనుమానాలు

ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదంటూ బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

బంజారాహిల్స్, డిసెంబర్ 21: బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10.. నగరం నడిబొడ్డు. ఇక్కడ ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ రేటు ప్రకారం గజం విలువ దాదాపు రూ.95వేలు. అంటే బహిరంగ మార్కెట్లో అంతకు మూడింతలు. ఆ లెక్కన ఎకరం కనీసం రూ.150 కోట్లు పలుకుతుంది. ఇంతటి విలువైన ఏరియాలో ఒకటీ, అరా కాదు! ఏకంగా ఐదెకరాల ప్రభుత్వ భూమిపై కొందరు కన్నేశారు. గతంలో అక్కడ ప్రభుత్వం వేసిన రేకుల షీట్స్ రంగు మార్చి.. మరో వరుసలో రేకులషీట్లతో స్వాధీనం చేసుకోవడమే కాకుండా.. ఒక గది, రెండు షెడ్లు నిర్మించి, సీసీ కెమెరాలతో ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటుచేశారు. కండ్ల ముందు బహిరంగంగా ఇదంతా జరుగుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ, జలమండలి అధికారులు ‘మాకు ఏమీ కనిపించట్లేదు!’ అన్నట్టు వ్యవహరిస్తున్నాయి. పేదోడు ప్రభుత్వ భూమిలో చిన్న గుడిసె వేసుకుంటేనే బుల్డోజర్లతో యుద్ధం ప్రకటించే అధికార యంత్రాంగం.. కొందరు ప్రైవేటు వ్యక్తులు ‘బిగ్’ స్కెచ్ వేసి సుమారు రూ.660 కోట్ల విలువైన భూమిని చెరబట్టినా అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారంటే తెర వెనక ఎంతటి బడా వ్యక్తులు చక్రం తిప్పుతున్నారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్ జిల్లా షేక్‌పేట మండలం సర్వే నంబర్ 403/పీ (బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10, టీఎస్ నంబర్ 1/1/1, బ్లాక్-హెచ్)లో 18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో 2.20 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలోనే జలమండలికి కేటాయించగా.. అందులో ఎకరం స్థలంలో రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టారు. చాలాకాలంగా ఈ భూములపై రాధికా సొసైటీ, గోదావరి సొసైటీతోపాటు అనేకమంది కన్నేశారు. వారందరూ పెట్టుకున్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను గత ప్రభుత్వాలు తిరస్కరించాయి. దీనిపై సుప్రీం కోర్టులో కేసులు కూడా కొనసాగుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇంతటి విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా, ఉండేందుకు కరోనా సమయాన్ని కూడా లెక్క చేయకుండా, 2020లో రెవెన్యూ అధికారులు 18 ఎకరాలను స్వాధీనం చేసుకొని చుట్టూ రేకుల షీట్స్ వేశారు. అయితే పరుశరామ్ పార్థసారథి అనే వ్యక్తి చాలాకాలం కిందటే ఇందులో ఐదెకరాల భూమిపై కన్నేశారు.

నకిలీ డాక్యుమెంట్లతో రంగ ప్రవేశం

ఈ భూమికి సంబంధించి పరుశరామ్ పార్థసారథి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్టు తెలుస్తున్నది. వాటి ప్రకారం.. 1930లో హసన్ అలీ అనే వ్యక్తికి కేటాయించిన స్థలాన్ని ఆయన వారసుడు హసన్ అలీఖాన్ నుంచి నారయ్య, సాయన్న 2.20 ఎకరాల చొప్పున కొనుగోలు చేశారు. ఇందులో నారయ్య నుంచి 1998లో 2.20 ఎకరాలను తాను కొనుగోలు చేసినట్టు పార్థసారథి డాక్యుమెంట్లు సృష్టించారు. అదేవిధంగా నారయ్యకు చెందిన 2.20 ఎకరాలను గతంలోనే నూకల రాఘవరావు కొనుగోలు చేయగా, ఆయన మరణానంతరం అతని వారసుల నుంచి 2009లో తాను కొనుగోలు చేసినట్టు పార్థసారథి మరో డాక్యుమెంట్ సృష్టించారు. ఇలా ఐదెకరాల డాక్యుమెంట్లతో గతంలోనే ఆ భూమిలోకి ప్రవేశించి, ఒక గదిని నిర్మించారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ కబ్జాను సీరియస్‌గా తీసుకోవడంతో రెవెన్యూ అధికారులు రంగప్రవేశం చేసి.. పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో 27.12.2021న ఒకసారి (ఎఫ్ఐఆర్ 943/2021), 4.1.2022న మరోసారి (ఎఫ్ఐఆర్-11/22) ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదయ్యాయి. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతో పాటు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారంటూ పోలీసులు కేసులు నమోదు చేసి, అరెస్టు కూడా చేశారు. అధికారులు పార్థసారథి నిర్మించిన గదిని కూల్చివేశారు. దీంతో ఆ కబ్జాపర్వానికి తెరపడింది.

న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్థసారథి మళ్లీ ఈ భూమిపై కన్నేశారు. కాకపోతే ఈసారి తెరవెనక పెద్ద తతంగమే నడిపారని తెలిసింది. ముఖ్యంగా ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో ప్రభుత్వంలోని కీలక వ్యక్తులను ఆశ్రయించి ‘బిగ్’ స్కెచ్ వేసినట్టు సమాచారం. ఇందుకోసం పార్థసారథి ముందుగా ఇంజంక్షన్ ఆర్డర్ తీసుకువచ్చారు. తాను రాఘవరావు, సాయన్న అనే వ్యక్తుల వద్ద 2.20 ఎకరాల చొప్పున కొనుగోలు చేసిన ఐదెకరాల స్థలంలోకి బలరామరాజు తిరుపతి, వేములపల్లి బాలాజీ అనే వ్యక్తులు ప్రవేశించి, ఆక్రమించుకుంటున్నారంటూ 2వ అదనపు చీఫ్ జడ్జి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వీరి నుంచి తన భూమి తనకు దక్కేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అయితే ఇదంతా ముందస్తు వ్యూహం కావడంతో బలరామరాజు తిరుపతి, వేములపల్లి బాలాజీ న్యాయస్థానానికి ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించకుండా ‘ఎక్స్‌పార్టీ’ అయ్యారు. దీంతో న్యాయస్థానం పార్థసారథికి ఇంజంక్షన్ ఆర్డర్ జారీచేసింది. కానీ వాస్తవానికి ఈ భూమి ప్రభుత్వానిది అనే విషయం న్యాయస్థానానికి తెలియదు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి.. ప్రభుత్వ భూమిపై సంబంధంలేని ఇద్దరు క్లెయిమ్ చేసుకుంటున్నారంటూ వాస్తవాల్ని కోర్టు ముందుంచాలి. రెవెన్యూ రికార్డు ప్రకారం ఆ భూముల సర్వేనంబర్ 403/పీ. కానీ పార్థసారథి చూపుతున్న డాక్యుమెంట్లలో ఉన్నది 403/52/పీ. అసలు రెవెన్యూ రికార్డుల్లో ఈ సర్వేనంబరే లేదు. కానీ ఈ వ్యవహారంలో అధికారులు జోక్యం చేసుకున్నట్టు కనిపించలేదు. దీంతో పార్థసారథి ఆ ఇంజంక్షన్ ఆర్డర్‌తో కొన్నిరోజుల కిందట ఆ భూమిలోకి ప్రవేశించారు. కేసీఆర్ హయాంలో 18 ఎకరాల చుట్టూ రెవెన్యూ అధికారులు నాలుగున్నర ఫీట్ల ఎత్తులో నీలిరంగు రేకుల షీట్స్ వేశారు. కానీ ఆ భూమిలో పార్థసారథి ఎనిమిది ఫీట్ల ఎత్తులో వేరే రంగు షీట్లు వేశారు. గతంలో ప్రభుత్వం వేసిన బ్లూ షీట్లకు తెల్ల రంగు వేశారు. గతంలో కూల్చిన గదిని తిరిగి పునర్నిర్మించారు. మరో రెండు షెడ్లు వేశారు. చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

వెలుగులోకి తీసుకువచ్చిన ‘నమస్తే తెలంగాణ’

దాదాపు 15-20 రోజుల కిందటనే ఈ భూమి కబ్జా అవుతున్న విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దీంతో అధికారులు హుటాహుటిన వచ్చి అక్కడ ‘ప్రభుత్వ స్థలం’ అంటూ బోర్డు ఏర్పాటుచేయడంతోపాటు రేకుల షీట్స్‌పై ప్రభుత్వ భూమి అని కూడా రాసినట్టు తెలిసింది. కానీ ఒక్కరోజులోనే ఆ బోర్డును తీసివేయడంతోపాటు షీట్స్ మీద ప్రభుత్వ భూమి అని రాసిన దానిని కూడా చెరిపివేశారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందటనే ‘నమస్తే తెలంగాణ’ జలమండలికి చెందిన 1.20 ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నాయంటూ ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితోపాటు రెవెన్యూ, హైడ్రా అధికారులు కూడా క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించారు. అక్కడ మీడియా ప్రతినిధులు ఉన్నా ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు. అయితే సాయంత్రానికి అటు జలమండలి, ఇటు రెవెన్యూ అధికారులు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. తమ భూములు కబ్జాకు గురి కాలేదని, అలా వచ్చిన కథనాల్లో వాస్తవంలేదని పేర్కొన్నారు. ఆ భూమి తమ స్వాధీనంలోనే ఉందని చెప్పుకొచ్చారు. కానీ వాస్తవానికి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఆ భూమిలో భారీ ఎత్తున ప్రైవేటు సెక్యూరిటీని మోహరించారు. సీసీ కెమెరాల నిఘాను పెంచారు. అంటే విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికార యంత్రాంగం ఆ చర్యలు తీసుకోకపోగా... మీడియాను సైతం తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారంటే తెర వెనక ఎంతటి ‘బిగ్’ హస్తం ఉన్నదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నాగర్‌కర్నూల్ జిల్లా నేరళ్లపల్లిలో జంగిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, బంధువులు, గ్రామస్థులు

అశ్రునయనాల మధ్య జంగిరెడ్డి అంత్యక్రియలు

- చితికి నిప్పంటిన జనార్దన్‌రెడ్డి
- నివాళులర్పించిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు

తిమ్మాజిపేట, డిసెంబర్ 21 : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి హైదరాబాద్‌లోని మర్రి స్వగృహంలో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. స్వగ్రామం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలోని మర్రి వ్యవసాయ క్షేత్రంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు నాగం శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీటీసీ, జేటీసీలకు పోస్టింగులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

చంద్రశేఖర్ గౌడ్

శివలింగయ్య

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): రవాణా శాఖలో డీటీసీ, జేటీసీలుగా పదోన్నతులు పొందిన అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐటీ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, అడ్మినిస్ట్రేషన్, ప్లానింగ్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా శివలింగయ్యకు పోస్టింగ్ ఇచ్చింది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా పదోన్నతులు పొందిన రవీందర్‌కుమార్‌గౌడ్‌ని ఆదిలాబాద్ డీటీసీ, వాణిని నల్లగొండ డీటీసీ, ఆఫ్రీన్ సిద్దిఖీని కమిషనర్ కార్యాలయ డీటీసీ, కిషన్‌ను మహబూబ్‌నగర్, సదానందంను రంగారెడ్డి డీటీసీలుగా నియమించింది.

మందకృష్ణపై నాంపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 21: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై హైదరాబాద్ నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మాలల మనోభావాలను కించపర్చారని ఆరోపిస్తూ తెలంగాణ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాంపల్లిలో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌కు ఇదే కేసును బదిలీ చేసినట్టు నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల రెండు, నాలుగో తేదీల్లో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తీవ్రస్థాయిలో మాలలను దూషిస్తూ దుర్భాషలాడారని రాంప్రసాద్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. కులాల మధ్య చిచ్చుపెడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్న మందకృష్ణపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు సీహెచ్ అరుణ్ కుమార్, ఎం మణిదీప్, ఎం వెంకటస్వామి, జీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డను కిడ్నాప్ చేశాడని ఆటోడ్రైవర్ హత్య

- యువకుడికి భార్యతో ఫోన్‌కాల్.. కిడ్నాప్
- కాళ్లు, చేతులు కట్టి, కాల్వలోకి తోసి హత్య
- పోలీస్ విచారణలో వెలుగులోకి హత్యోదంతం

వెంగళరావునగర్, డిసెంబర్ 21: కనిపెంచిన మమకారం ఆ తల్లిదండ్రులను హంతకులుగా మార్చింది. ఒక్కగానొక్క గారాల బిడ్డను మాయమాటలతో అపహరించుకెళ్లిన యువకుడిని బాలిక తల్లిదండ్రులు హతమార్చారు. సినీ ఫక్కీలో ఈ ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్‌లోని నిజాంపేట్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఓ కుమార్ (30) ప్రేమ వివాహం చేసుకొన్నారు. ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన ఓ కారు డ్రైవర్ తన భార్య, కూతురుతో కలిసి జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నారు. ఏడో తరగతి చదువుతున్న కారు డ్రైవర్ కూతురును ఆటో డ్రైవర్ కుమార్ ట్రాప్ చేసి గత తీసుకెళ్లి యూసఫ్‌గూడలోని ఓ గదిలో నిర్బంధించాడు. లైంగికదాడికి యత్నించగా ఆ బాలిక తప్పించుకొని వెళ్లింది. బాలానగర్ పోలీసులకు కనిపించిన ఆ బాలికను విచారిస్తే తాను అనాథనని చెప్పడంతో వారు నింబోలిఅడ్డలోని హోంకు తరలించారు. ఈ సమయంలో ఆ బాలిక కోసం ఆమె తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈలోగా కరోనా సమయంలో ఆ బాలికకు ఇప్పించిన ల్యాప్‌ట్యాప్‌ను పరిశీలించగా, స్నాప్‌చాట్‌లో ఉన్న ఓ ఫోన్ నంబర్‌ను గుర్తించగా, అది కుమార్‌దని తెలిసింది.

కుమార్(ఫైల్)

కూతురు కోసం తల్లి హనీట్రాప్

ఎల్లాగైనా కుమార్ అనే యువకుడే తన కూతురును కిడ్నాప్ చేశాడని ఆ తల్లిదండ్రులు భావించారు. దీంతో ఆ బాలిక తల్లి స్నాప్‌చాట్‌లో ఓ ఐడీని క్రియేట్ చేశారు. ఆమె హనీట్రాప్ చేసి ఆ యువకుడిని మియాపూర్ రప్పించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు కుమార్‌ను పట్టుకొని కొట్టి కారులో కిడ్నాప్ చేశారు. నిర్మానుష్యప్రాంతానికి తీసుకెళ్లి తన కూతురు సమాచారం చెప్పాలని నిలదీశారు. తన నుంచి తప్పించుకపోయిన విషయాన్ని చెప్పాడు. దీంతో వారి దెబ్బలకు తాళలేక ఆ యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కారులో సూర్యాపేట వైపు తీసుకెళ్లి పెద్ద బండరాయిని కాళ్లు, చేతులకు కట్టిపడేసి నాగార్జున సాగర్ ఎడమ కాల్వలోకి సజీవంగానే తోసేశారు. దీంతో బోరబండ పోలీస్‌స్టేషన్‌లో కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఆ తర్వాత కారు డ్రైవర్ కూతురు తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నది. అయితే కుమార్ ఆటోను ఆ కారు డ్రైవర్ వాడుతుండగా, కుమార్ బంధువులు ఆటో బంపర్‌ను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసులో కీలక మలుపు తిరిగింది. సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసుల ద్వారా గుర్తు తెలియని డెడ్‌బాడీ డీఎన్ఏ కోసం ఎముకలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ హత్యోదంతంలో బాలిక తల్లిదండ్రులపై కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సుపారీ కోసం వచ్చి.. హత్యకు గురై!

ధర్మపురి, డిసెంబర్ 21 : ఓ వ్యక్తిని హత్య చేయడానికి సుపారీ కోసం వచ్చిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లలో చోటుచేసుకున్నది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరెళ్లకు చెందిన మెరుగు లక్ష్మణ్, కమలాపూర్‌కు చెందిన గోపాల్ ముంబైలో కల్లుడిపో నిర్వహిస్తున్నారు. ఓ రోజు లక్ష్మణ్.. గోపాల్‌తో మాట్లాడుతూ తన మరదలిని నేరెళ్లకు చెందిన తోకల గంగాధర్ వేధిస్తున్నాడని, అతడిని చంపడానికి సుపారీ మాట్లాడుదామని చెప్పాడు. దీనికి గోపాల్ తన స్నేహితుడైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ సూర్యప్రకాశ్‌సింగ్ (27) అనే షూటర్‌తో రూ.4 లక్షల సుపారీ కుదుర్చుకున్నారు. కొద్ది రోజుల తరువాత హత్య చేయాల్సిన అవసరం లేదని గోపాల్ చెప్పగా ఒప్పందం ప్రకారం రూ.4 లక్షలు ఇవ్వాల్సిందేనని, లేదంటే నీ తండ్రిని చంపుతానని సూర్యప్రకాశ్‌సింగ్ బెదిరించాడు. దీంతో గోపాల్ షూటర్‌ను అకౌంట్ సెటిల్ చేస్తానని ఈ నెల 12న నేరెళ్లకు తీసుకువచ్చాడు. 13న రాత్రి నేరెళ్ల అటవీప్రాంతంలో నేరెళ్లకు చెందిన శేఖర్, గోపాల్, సూర్యప్రకాశ్ మద్యం తాగారు. గోపాల్ బండరాయితో సూర్యప్రకాశ్ తలపై మోది హత్య చేశాడు. గ్రామానికి కొత్తగా కార్లు రావడం, రెండు రోజుల క్రితం వీరితో తిరిగిన వ్యక్తి కనిపించకపోవడంతో పోలీసులు విచారణ సాగించారు. దీంతో భయపడిని గోపాల్, శేఖర్ శనివారం ధర్మపురి పోలీస్ స్టేషన్‌కు వచ్చి నేరం ఒప్పుకొని లొంగిపోయారు.

- విద్యార్థులే స్వీపర్లు

సీఎం కప్ పోటీల కోసం జగిత్యాలలోని మినీ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌ను వాచ్‌మన్ శనివారం విద్యార్థులతో క్లీన్ చేయించారు. స్థానికులు ఫొటోలు, వీడియోలు తీస్తూ వాచ్‌మన్‌ను ప్రశ్నించగా గదికి తాళంవేసి వెళ్లిపోయాడు. విద్యార్థులతో మాట్లాడగా తాము హైస్కూల్‌లో చదువుతున్నామని, స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. డీవైఎస్‌వో రవికుమార్‌ను ‘నమస్తే’ వివరణ కోరగా నీటిలో చెత్త పడటంతో మున్సిపల్ సిబ్బంది క్లీన్ చేస్తుండగా, విద్యార్థులు ఉత్సాహంతో అందులోకి దిగినట్టు వెల్లడించారు. – జగిత్యాల టౌన్

- మధ్యాహ్న భోజనంలో పురుగులు

వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించడం కలకలం సృష్టించింది. పురుగుల అన్నం తినలేక విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ప్రభు, స్థానిక నాయకులు పాఠశాలకు చేరుకొని వంటలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హెచ్‌ఎంను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. –దోమ

ఎంజీయూ బాలుర హాస్టల్‌లో పడిన పైకప్పు పెచ్చులు

ఊడిపడిన హాస్టల్ పైకప్పు పెచ్చులు

విద్యార్థి తలకు గాయం

రామగిరి, డిసెంబర్ 21 : నల్లగొండ జిల్లా కేంద్రం శివారులో ఉన్న మహాత్మాగాంధీ యూనివర్సిటీ హాస్టల్ భవనం పైకప్పు పెచ్చులూడి పడగా విద్యార్థి తలకు గాయమైంది. యూనివర్సిటీలోని నీలగిరి బాలుర హాస్టల్ బాత్రూమ్‌లో ఈ ఘటన జరిగింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం బ్రష్ చేసుకునేందుకు విద్యార్థులంతా బాత్రూమ్‌కు వెళ్లారు. వాష్‌బేషన్ వద్ద మొహం కడుక్కుంటుండగా పైకప్పు పెచ్చులూడి నందుప్రసాద్ అనే విద్యార్థి తలపై పడటంతో గాయమైంది. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థులు వాపోయారు. ఇంకా ఎక్కడి నుంచి పెచ్చులు ఊడిపడుతాయోనన్న భయాందోళనలో ఉన్నారు. ఇదే విషయమై హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేశ్‌ను వివరణ కోరగా.. గాయమైన విద్యార్థిని జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లి చికిత్స చేయించినట్టు తెలిపారు.

హాస్టల్ విద్యార్థిని మృతిపై ఆందోళన

- అందుగులగూడలో డీఎడ్ విద్యార్థిని మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

కుమ్రంభీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ బెజ్జూర్, డిసెంబర్ 21 : ‘అధికారుల నిర్లక్ష్యంతోనే మా బిడ్డ చనిపోయింది. న్యాయం చేసే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదు’ అంటూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ విద్యార్థిని(డీఎడ్) వెంకటలక్ష్మి(19) కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. బెజ్జూర్ మండలం అందుగులగూడలో వెంకటలక్ష్మి ఇంటి వద్ద మృతదేహంతో శనివారం ఆందోళన చేపట్టారు. కూతురు మృతిపై సమాచారం ఇవ్వలేదని, రాత్రికి రాత్రే బిడ్డ మృతదేహాన్ని ఇంటికి పంపించారని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తంచేసింది. మృతదేహంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధం కాగా కౌటాల సీఐ ముత్యం రమేశ్‌తోపాటు ఎస్ఐలు ప్రవీణ్, నరేశ్, మధూకర్ వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి మద్దతుగా నిలిచారు. దీంతో పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులు రాంప్రసాద్, సారయ్యను స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్యాంరావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శుక్లా శ్రద్ధా వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా విద్యార్థిని మృతికి కారణమైన వార్డెన్ నిఖత్‌ను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సస్పెండ్ చేశారు.

గుడిహత్నూర్‌లో పోలీసులపై రాళ్ల దాడి

బాలిక కిడ్నాప్ నేపథ్యంలో ఘటన

రాళ్ల దాడిలో గాయపడిన సీఐ, ఎస్సై

ఆదిలాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో బాలిక కిడ్నాప్‌నకు సంబంధించిన గొడవను అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌కు చెందిన ఏడోతరగతి బాలికను ఓ యువకుడు తీసుకుపోయాడనే విషయం తెలియడంతో ఆమె బంధువులు యువకుడి ఇంటిలోని ఫర్నిచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు యువకుడి ఇంటికి చేరుకుని బాలిక బంధువులకు నచ్చచెప్పే ప్రయత్నంచేశారు. ఆగ్రహంతో ఉన్న బంధువులు పోలీసులపై రాళ్లతో దాడి చేసి, పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఇచ్చోడ సీఐ భీమేశ్, గుడిహత్నూర్ ఎస్సై తిరుపతితోపాటు ఐదుగురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. యువకుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులు, యువకుడు, బాలికను రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

గురుకులం ఎదుట విద్యార్థినుల ధర్నా

అందోల్, డిసెంబర్ 21: సంగారెడ్డి జిల్లా అందోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తమకొద్దంటూ విద్యార్థినులు శనివారం పాఠశాల గేట్ ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్ సద్గుణ మేరీగ్రేస్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీవో పాండు, సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ విష్ణుసాగర్ వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాఠశాలకు వచ్చి విద్యార్థినులు, ప్రిన్సిపాల్, సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థినులకు ఇబ్బందులు రాకుండా చూస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు.

టోల్‌ఫ్రీకి కాల్ చేస్తే 9.8 లక్షలు మాయం

- పోగొట్టుకున్న ఏటీఎం బ్లాక్ చేయించేందుకు కాల్
- నంబర్‌లో ఒక అంకె మిస్
- సైబర్ నేరస్థులకు కనెక్ట్
- ఓటీపీ చెప్పడంతో భారీ మోసం
- జగిత్యాల జిల్లాలో ఘటన

గంగాధర, డిసెంబర్ 21: పోగొట్టుకున్న తన ఏటీఎం కార్డు బ్లాక్ చేయించుకునేందుకు బ్యాంక్ టోల్ ఫ్రీ నంబర్‌కు బదులు మరో నంబర్‌కు కాల్ చేసి, సైబర్ నేరస్తులకు చిక్కి రూ.9.8 లక్షలు పోగొట్టుకున్న ఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలానికి చెందిన శ్రీనివాస్‌కు కరీంనగర్ జిల్లా గంగాధర యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. శ్రీనివాస్ ఇటీవల తన ఏటీఎంకార్డు పోగొట్టుకున్నాడు. ఈ నెల 5న బ్యాంకుకు వెళ్లి కార్డు పోయిందని చెప్పగా.. కార్డు బ్లాక్ చేయించుకుంటేనే కొత్త కార్డు వస్తుందని, అందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800222244కు కాల్ చేయాలని సిబ్బంది సూచించారు. 6న శ్రీనివాస్ టోల్‌ఫ్రీ నంబర్ 1800222244కు బదులు పొరపాటున 800222244కు కాల్‌చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి హిందీలో మాట్లాడి కార్డు బ్లాక్ చేయించేందుకు ఓటీపీ చెప్పాలని కోరగా, తన మొబైల్‌కు వచ్చిన ఓటీపీని శ్రీనివాస్ చెప్పాడు. దీంతో ఒకసారి రూ.8 లక్షలు, మరోసారి రూ.1.8 లక్షలు శ్రీనివాస్ ఖాతా నుంచి డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు బ్యాంకుకు వెళ్లి వివరించగా వారి సూచన జగిత్యాల సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.